## • త్వరలోనే దేశ తొలి ఫ్లయింగ్ ట్యాక్సీ



చెన్నై, మార్చి 7: భారతదేశపు మొట్ట మొదటి 'ఫ్లయింగ్ ట్యాక్సీ-ఈ200'ను అభివృద్ధి చేయటంలో అద్భుతమైన పురోగతి సాధించామని 'ఈ-ప్లేన్' కంపెనీ ఫౌండర్ ప్రొఫెసర్ సత్య చక్రవర్తి ప్రకటించారు. దేశంలో తొలి ఫ్లయింగ్ ట్యాక్సీ సేవలు 7 లేదా 8 నెలల్లో ప్రారంభించే అవకాశాలున్నాయని, ఉబర్ ట్యాక్సీ రేట్‌తో పోల్చితే రెట్టింపు ధరలో వీటి సేవలుంటాయని ఆయన తెలిపారు. ఐఐటీ-మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన తాజాగా ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ, ఈ200 డిజైన్, రక్షణ, భద్రతా ప్రమాణాల గురించి వెల్లడించారు. 'చిన్న చిన్న ప్రదేశాల్లోనూ ల్యాండ్ అయ్యే విధంగా చిన్నదైన ఎయిర్‌క్రాఫ్ట్‌ను రూపొందించాం. మొట్టమొదటి దేశీయ ఫ్లయింగ్ ట్యాక్సీ ఈ200 ప్రయాణం అక్టోబర్ లేదా నవంబర్‌లో ఉంటుంది. భారత విమానయానంలో ఇదొక చరిత్రాత్మక ఘట్టమవుతుంది' అని అన్నారు. ఈ200లో అనేక సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయని అన్నారు. ఫ్లయింగ్ ట్యాక్సీ నియంత్రణను అధునాతన సాంకేతికతతో చేపడతారని చెప్పారు.

## • మన ఫిల్టర్ కాఫీకి రెండో స్థానం



కోల్‌కతా, మార్చి 7: పొద్దుపొద్దునే గ్లాసెడు కాఫీ తాగనిదే ఏమీ తోచదు మనవాళ్లకు. అంతగా మన జీవితంలో భాగమైన కాఫీకి ప్రపంచంలో రెండో ర్యాంక్ దక్కింది. కాఫీలో ఎన్నో రకాలున్నప్పటికీ భారతీయులు ఇష్టంగా తాగేది మాత్రం ఫిల్టర్ కాఫీనే. ఫుడ్ అండ్ ట్రావెల్ గైడ్ ప్లాట్‌ఫాం టేస్ట్ అట్లాస్ ఇటీవల విడుదల చేసిన ప్రపంచ టాప్ 38 కాఫీల జాబితాలో మన ఫిల్టర్ కాఫీ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నది. మొదటి ప్లేస్‌లో క్యూబాకు చెందిన ఎస్ప్రెస్సో నిలిచింది. ఇండియాలో మరీ ముఖ్యంగా సౌతిండియాలో ఫిల్టర్ కాఫీకి ఉన్న డిమాండే వేరు. మూడు, నాలుగు స్థానాల్లో గ్రీస్‌కు చెందిన రెండు రకాల కాఫీలు నిలువగా.. ఇటలీకి చెందిన క్యాపచినో ఐదో స్థానంలో, తుర్కియేకు చెందిన టర్కిష్ కాఫీ ఆరో స్థానంలో, ఇటలీకే చెందిన కాఫీ రిస్ట్రెట్టో 7వ స్థానంలో, గ్రీస్‌కు చెందిన ఇంకో రకం ఫ్రాప్పె 8వ స్థానంలో, జర్మనీకి చెందిన ఐస్కాఫీ 9వ స్థానంలో నిలువగా.. చివరిగా పదో స్థానంలో వియత్నాంకు చెందిన వియత్నామీస్ ఐస్‌డ్ కాఫీ నిలిచింది.

## • రోజుకు ఎన్ని అడుగులు నడవాలి?



సిడ్నీ, మార్చి 7: ప్రతిరోజూ వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెప్తూ ఉంటారు. అయితే రోజుకు ఎంత సేపు నడవాలి? ఎన్ని అడుగులు వేస్తే మంచిది? అనే అనుమానాలు మాత్రం చాలామందికి ఉంటాయి. తాజాగా ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనం ఈ అనుమానాలను తీర్చింది. ప్రతిరోజూ 2,200 అడుగుల తర్వాత వేసే ప్రతి అడుగు వల్ల ఆరోగ్యానికి ఎంతోకొంత మేలు జరుగుతుందని, ముఖ్యంగా గుండెజబ్బులు, అకాల మరణ ముప్పు తగ్గుతున్నదని వీరు గుర్తించారు. రోజుకు 9,000 నుంచి 10,000 అడుగులు నడిచే వారిలో గుండెజబ్బుల ముప్పు 21 శాతం తక్కువగా ఉంటున్నట్టు తేల్చారు. రోజుకు 9,000 నుంచి 10,500 అడుగులు నడిచే వారిలో అకాల మరణం సంభవించే ముప్పు 39 శాతం తగ్గుతున్నట్టు గుర్తించారు. వాకింగ్ చేసిన తర్వాత మిగతా రోజంతా ఎలాంటి శారీరక శ్రమ చేయని వారిలోనూ ఈ ప్రయోజనాలు ఉన్నట్టు పరిశోధకులు చెప్తున్నారు.

## గోవా బీచుల్లో కో-వర్కింగ్ ప్రదేశాలు

పనాజి : గోవా సందర్శించే పర్యాటకుల కోసం ఇక్కడి మోర్జిమ్, అశ్వెమ్ బీచుల్లో 'కో-వర్కింగ్ స్పేస్'లు అందుబాటులోకి తెస్తున్నట్టు ఆ రాష్ట్ర టూరిజం శాఖ గురువారం ప్రకటించింది. గోవా అనగానే అందరికీ గుర్తుకువచ్చేది బీచ్‌లే. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఒకచోట సమావేశమై తమ ఆలోచనలు, నైపుణ్యాల్ని పంచుకునే ప్రదేశాల్ని 'కో-వర్కింగ్' స్పేస్‌లంటారు. ఇది కొత్త వ్యాపార అవకాశాలకు దారితీస్తుంది. ఆహ్లాదంతోపాటు, కో-వర్కింగ్‌కు కేంద్రంగా గోవా పర్యాటకాన్ని మార్చాలని భావిస్తున్నట్టు రాష్ట్ర టూరిజం సెక్రెటరీ సంజీవ్ అహుజా విలేకరులతో చెప్పారు. పర్యాటకంగా రాష్ట్రాన్ని ప్రమోట్ చేసేందుకు అధికారులు మూడు రోజులపాటు ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించారు.

## కేరళ సర్కారు ఓటీటీ 'సీస్పేస్'

### ప్రభుత్వం ప్రారంభించడం దేశంలోనే తొలిసారి

తిరువనంతపురం, మార్చి 7: దేశంలోనే తొలిసారిగా కేరళ ప్రభుత్వం సొంతంగా ఓటీటీ ప్లాట్‌ఫాంను లాంచ్ చేసింది. దీని పేరు 'సీస్పేస్'. కేరళ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కేఎస్ఎఫ్‌డీసీ) దీనిని నిర్వహిస్తుంది. తిరువనంతపురంలోని కైరాలీ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పరిశ్రమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కళాత్మక, సాంస్కృతిక విలువలతో కూడిన చిత్రాలకు ఇది ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. సీస్పేస్ ఇంట్లోకి నాణ్యమైన చిత్రాలను తీసుకొచ్చే మాధ్యమంగా ఉంటుందని వివరించారు. సీస్పేస్ ఇప్పటికే విడుదలైన సినిమాలను ప్రసారం చేస్తుందని, కాబట్టి ప్రధాన ఫిల్మ్ ఇండస్ట్రీకి దీనివల్ల ఎలాంటి హాని ఉండదని పునరుద్ఘాటించారు. తొలి విడత స్ట్రీమింగ్ కోసం 42 సినిమాలను ఎంపిక చేశా రు. రెవెన్యూ షేర్, ఆదాయం, నిర్వహణలో పూర్తి పాదర్శకంగా ఉండే సీస్పేస్‌ను 'పేపర్ వ్యూ'లో నిర్వహిస్తారు.



**'అందాల' కేరింతలు** | అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా ముంబైలో గురువారం ఫొటోకు పోజిచ్చిన ప్రపంచ సుందరి పోటీలో పాల్గొంటున్న అందగత్తెలు.

# బాండ్ల నుంచే 82% అజ్ఞాత ఆదాయం

### ఆరు జాతీయ పార్టీల ఆదాయాలపై అధ్యయనం • వివరాలు వెల్లడించిన స్వచ్ఛంద సంస్థ ఏడీఆర్

న్యూఢిల్లీ, మార్చి 7: జాతీయ పార్టీలకు 2022-23లో అజ్ఞాత వనరుల నుంచి వచ్చిన మొత్తం ఆదాయంలో 82 శాతానికిపైగా ఎలక్టోరల్ బాండ్ల నుంచే వచ్చినట్టు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆర్థిక నివేదికల ప్రకారం.. అజ్ఞాత వనరుల ద్వారా వచ్చిన రూ.1,832.88 కోట్లలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,510 కోట్లు అని తేలింది. మొత్తం ఆదాయంలో ఇది 82 శాతం. ఆరు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ పార్టీ, నేషనల్ పీపుల్స్ పార్టీల ఆదాయాలపై అధ్యయనం జరిగింది. అత్యధికంగా బీజేపీకి అజ్ఞాత మూలాల నుంచి రూ.1400 కోట్లు వచ్చింది. అంటే 76 శాతం ఆదాయం ఇలా వచ్చినదే. ఆ తర్వాత స్థానంలో 315.11 కోట్లు వచ్చాయని కాంగ్రెస్ ప్రకటించింది. రూ. 20 వేల కంటే ఎక్కువ లేదా అంతకంటే తక్కువ కూపన్లు లేదా ఎలక్టోరల్ బాండ్ల విక్రయం ద్వారా లేదా తెలియని ఆదాయ వనరుల నుంచి స్వచ్ఛంద విరాళాలుగా ఎలాంటి నిధులు స్వీకరించలేదని బీఎస్పీ ప్రకటించిందని ఏడీఆర్ తెలిపింది. జాతీయ పార్టీలలాగే రాష్ట్రీయ పార్టీలు కూడా ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు పొందాయని ఏడీఆర్ పేర్కొన్నది. 2004-05 నుంచి 2022-23 మధ్యకాలంలో జాతీయ పార్టీలు



తెలియని మూలాల నుంచి రూ.19,083 కోట్లు వసూలు చేశాయని ఏడీఆర్ వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆరు జాతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.3,076.88కోట్లుగా ఏడీఆర్ పేర్కొన్నది. రూ.20వేల లోపు విరాళం ఇచ్చే వ్యక్తులు లేదా సంస్థల వివరాలు ప్రస్తుతం వెల్లడించాల్సిన అవసరం లేదు. రాజకీయ నిధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు అవసరమని ఏడీఆర్ సంస్థ సూచించింది. సమాచార హక్కు చట్టం కింద దాతలందరి వివరాలు బహిర్గతం చేయాలని సంస్థ వాదిస్తున్నది. విరాళాల మొత్తంతో సంబంధం లేకుండా చెల్లింపు విధానాన్ని ఆదాయపు పన్ను శాఖ, ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆడిట్ నివేదికలో ప్రకటించాలని సంస్థ ప్రతిపాదిస్తున్నది.

#### ఎస్బీఐపై కోర్టు ధిక్కార పిటిషన్

సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిందంటూ ఎస్బీఐపై ధిక్కార చర్య తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మార్చి 6లోగా ఎన్నికల సంఘానికి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసిన వివరాలను బ్యాంకు వెల్లడి చేయాల్సి ఉండింది. గడువు ముగిసినా ఎస్బీఐ ఎన్నికల సంఘానికి ఈ వివరాలు వెల్లడించలేదు. దీంతో ఎస్బీఐపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్జీవోస్ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ అండ్ కామన్ కాజ్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దావా వేశారు. ఈ వ్యాజ్యాన్ని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం పరిగణనలోకి తీసుకున్నది. అయితే బాండ్ల వివరాలు వెల్లడించేందుకు గడువును జూన్ 30 వరకు పొడిగించాలని ఎస్బీఐ మార్చి 4న కోర్టును ఆశ్రయించింది. దీనిపై మార్చి 11న విచారణ జరగనున్నది. అదే రోజు దానితోపాటు ధిక్కార పిటిషన్‌ను కూడా విచారించాలని భూషణ్ కోరారు.

### రష్యాకు భారత యువతను తరలిస్తున్న

# ముఠా గుట్టు రట్టు

### పలువురిని అదుపులోకి తీసుకున్న సీబీఐ

న్యూఢిల్లీ: ఉద్యోగాల పేరుతో రష్యా- ఉక్రెయిన్ యుద్ధ ప్రాంతానికి భారత యువతను అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును సీబీఐ రట్టు చేసింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున బలవంతంగా పాల్గొన్న హైదరాబాద్ యువకుడు సహా పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించింది. వీసా కన్సల్టెన్సీ సంస్థలు, ఏజెంట్లపై కేసులు నమోదు చేసిన సీబీఐ ఢిల్లీ, తిరువనంతపురం, ముంబై, అంబాలా, చండీగఢ్, మధురై, చెన్నైలలో అనేక చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సంస్థలు, వాటి ఏజెంట్లు దాదాపు 35 మంది యువకులను అధిక జీతం, ఆకర్షణీయమైన ఉద్యోగాలను ఆశ పెట్టి, రష్యాకు తరలించినట్లు సీబీఐ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాలు, స్థానిక ఏజెంట్ల ద్వారా వీరు ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. బాధితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మన దేశం నుంచి అక్రమంగా తరలించిన యువకులకు, వారు ఇష్టపడకపోయినప్పటికీ, యుద్ధ శిక్షణ ఇచ్చి, యుద్ధంలోకి పంపిస్తున్నారని, వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు.

# ఆర్టికల్ 370పై తప్పుదోవ పట్టించారు

### కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శలు

శ్రీనగర్, మార్చి 7: ఆర్టికల్ 370పై కాంగ్రెస్ దేశాన్ని తప్పుదారి పట్టించిందని, దీని వల్ల జమ్ముకశ్మీర్ ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోదీ గురువారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. ఆర్టికల్-370 రద్దు తర్వాత ప్రధాని కశ్మీర్‌లో పర్యటించటం ఇదే మొదటిసారి. రాష్ట్రంలో రూ.5వేల కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రకటించారు. శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియం వద్ద చేపట్టిన ర్యాలీలో ప్రధాని మోదీ కశ్మీరీలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్ స్వేచ్ఛా గాలుల్ని పీల్చుకుంటున్నదని, ఈ ప్రాంత అభివృద్ధి మరోస్థాయికి చేరుకున్నదని ప్రధాని అన్నారు. భారతదేశానికి జమ్ముకశ్మీర్.. శిరస్సు వంటిదన్నారు. అభివృద్ధి, గౌరవానికి చిహ్నంగా అదెప్పుడూ తలెత్తుకొని ఉండాలన్నారు. జమ్ముకశ్మీర్ అభివృద్ధి భారత్ అభివృద్ధికి కీలకమన్నారు.

## పాక్‌లో తొలి సిక్కు మంత్రి

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ మంత్రిగా సర్దార్ రమేశ్ సింగ్ అరోరా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో దేశ విభజన తర్వాత పాక్‌లో ఈ పదవిని చేపట్టిన తొలి సిక్కు నేతగా నిలిచారు. ఆ దేశంలోని మైనారిటీల్లో ఆయన పలుకుబడిగలవారు. ఆయన మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్-ఎన్ పార్టీకి చెందినవారు.

